సాక్షి పల్నాడు

శనివారం । 4 । మార్చి । 2023

I



భూసర్వేకు సహకరించాలి

మేదరమెట్ల: భూ రీసర్వేకి రైతులు సహకరించాలని జేసీ కే.శ్రీనివాసులు అన్నారు. కొరిశపాడు మండలం పీ.గుడిపాడులో రాళ్లు ఏర్పాటును జేసీ శుక్రవారం ప్రారంభించారు.



నేడు ప్రకాశం జెడ్పీ సమావేశం

బాపట్ల: ప్రకాశం జిల్లా పరిషత్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు జరుగుతుందని సీఈఓ జాలిరెడ్డి తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక మూడో రోజు గుంటూరు జిల్లాలో 97.36 శాతం పంపిణీ పూర్తయింది. శుక్రవారం సాయంత్రానికి 2,46,548 మందికి రూ.67.73 కోట్లు అందజేశారు.

న్యూస్‌రీల్

యార్డులో 98,597 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 90,137 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 98,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 73,182 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్టు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

100 సవర్ల బంగారం, రూ.6 లక్షలు మాయం

తనయుడే తస్కరించాడని పోలీసులకు తండ్రి ఫిర్యాదు

చీరాల: చెడు వ్యసనాలకు అలవాటుపడి ఇంట్లోనే చోరీ చేశాడు కుమారుడు. ఈ ఘటన పట్టణంలోని జాలాది కాంప్లెక్స్‌లో జరిగింది. వన్‌టౌన్ సీఐ మల్లేశ్వరరావు వివరాల మేరకు.. పట్టణంలోని జాలాది కాంప్లెక్స్‌లో నివసించే జూలకంటి సుబ్బారావు వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. గతేడాది డిసెంబర్‌లో తన చిన్నకుమారుడు జూలకంటి బాలకృష్ణ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కొద్ది రోజులుగా ఇంట్లో దాచిన ఉంచిన 100 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షల నగదు కూడా కనిపించకపోవడంతో తన చిన్నకుమారుడే అపహరించి స్థానిక ప్రైవేట్ బ్యాంకులో కుదువ పెట్టాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

7న మెడికల్ కాలేజీ డే వేడుకలు



గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాల కాలేజ్ డే వేడుకలను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి తెలిపారు. కాలేజ్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ప్రారంభమయ్యే కాలేజ్ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కాలేజ్ డే సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు మార్చి 6న అవార్డ్స్ పంపిణీ చేస్తారన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డ్స్ అందజేస్తారన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా శత చండీ సహిత మహా రుద్రయాగం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై గల శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శత చండీ సహిత మహా రుద్రయాగం రెండో రోజు శుక్రవారం వైభవంగా జరిగింది. లోక కళ్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న యాగాలను ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షించగా, ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు పాల్గొన్నారు. మహా గణపతి హోమం, మహా గణపతి పూజ, సూర్య నమస్కారాలు, నిత్య హోమాలు, మహా రుద్ర హవనం, చండీహోమం, మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 38 మంది రుత్వికులు హోమ, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహా రుద్రయాగాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు.

చిత్తశుద్ధితో అభివృద్ధి

- 15వ ఆర్థిక సంఘ నిధులతో పనులు చేపట్టేందుకు నిర్ణయం
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదించిన చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- జిల్లా, మండలస్థాయిలోనూ కమిటీలు

రూ. 6.37 కోట్లతో గ్రామాల్లో రోడ్లు కాలువల నిర్మాణం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు రహదారుల నిర్మాణాలను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.37 కోట్లతో చేపట్టేందుకు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఆమె ఛాంబర్లో నాలుగు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, పనులకు సంబంధించిన స్థాయీ సంఘ సమావేశాలను ఆయా సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతోపాటు సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. 15వ ఆర్థిక సంఘ బేసిక్ గ్రాంటు నుంచి గ్రామాల్లో నూతన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, రోడ్లకు మరమ్మతులు, వివిధ గ్రామాల్లో శ్మశాన వాటికలు, రోడ్లకు గ్రావెలింగ్ వంటి 112 పనులను ఆమోదించారు. నరసరావుపేట మండలంలోని కొండకావూరు పరిధిలో కోటప్పకొండలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసేందుకు మొత్తం ఐదు విభాగాలు చేపట్టనున్న పనులకు సంబంధించి జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.44.78 లక్షల ప్రతిపాదనలను ఆమోదించారు.

➡ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 351 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న 22,104 మంది విద్యార్థులకు సాయంత్రం వేళలో అల్పాహారాన్ని అందించేందుకు జెడ్పీ నుంచి ముందస్తు కేటాయించిన రూ.49,73,400 ఆమోదం తెలిపారు.

➡ నరసరావుపేట, తాడికొండ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణాలకు 15వ ఆర్థిక సంఘ బేసిక్ గ్రాంటు నుంచి రూ.33.50 లక్షలు కేటాయిస్తూ ఆమోదించారు. ఆరు శాతం ఎస్టీ గ్రాంటు ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాన్ని చేపట్టేందుకు ఆమోదం తెలిపారు.

➡ నిజాంపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతించారు.

ఆస్తుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

జెడ్పీకి చెందిన ఆస్తులను పరిరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా చెప్పారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జెడ్పీకి చెందిన ఆస్తులను గత పాలకవర్గాల హయాంలో ఇష్టారాజ్యంగా కేటాయింపులు జరిపి, అన్యాక్రాంతం చేశారని, ప్రస్తుతం తాము గత ఏడాది కాలానికి పైగా ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జెడ్పీ సీఈవో జె.మోహనరావు మాట్లాడుతూ జెడ్పీ ఆస్తులను పరిరక్షించేందుకు తొలిసారిగా గత నెలలో మూడు జిల్లాల ఆర్డీఓల నేతృత్వంలో ఎంపీడీఓలందరితో కలిసి నిర్వహించిన సమావేశం ద్వారా రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకునేందుకు అడుగు ముందుకు పడిందని చెప్పారు. జెడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడటంతోపాటు ఆదాయాన్ని పెంచుకునేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

➡ మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం నాణ్యతపై హెచ్ఎంలకు అవగాహన కల్పించడం ద్వారా మరింత ఎక్కువమంది విద్యార్థులు జగనన్న గోరుముద్దను తీసుకునేలా చూడాలని క్రిస్టినాతోపాటు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జెడ్పీటీసీలు అభిప్రాయపడ్డారు. వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి.

పల్నాడు డీఈఓను సరెండర్ చేయాలి

విద్య-వైద్యంపై జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడు డీఈఓ ఎం.వెంకటప్పయ్య ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల వినుకొండలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉపాధ్యాయులను యూజ్‌లెస్ ఫెలోస్ అంటూ డీఈఓ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, ఉపాధ్యాయులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పల్నాడు డీఈఓ వెంకటప్పయ్య గైర్హాజరు కావడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఇదే విధమైన వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఇటువంటి అధికారి విద్యాశాఖకు తగడని, ఆయన్ను తక్షణమే ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ పల్నాడు డీఈఓ వ్యవహారశైలిపై పలువురు ఉపాధ్యాయులు తనకూ ఫిర్యాదు చేశారని చెప్పారు.

సింహవాహనంపై మంగళాద్రిపతి

శోభాయమానంగా నారసింహుని బ్రహ్మోత్సవాలు



సింహవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవంలో సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో సింహవాహనంపై కొలువుదీరిన బ్రహ్మాండనాయకుడు నృసింహస్వామి భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చి దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నరసింహుని వేషాలు, భజనలు, నృత్యాలు, కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మల్లాది విష్ణులు స్వామి వారికి పూజలు నిర్వహించి రథాన్ని లాగి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి కళాకారులను అభినందించారు. ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

నేడు హంస, గజవాహనాలపై..

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్న శ్రీవారు అదేరోజు రాత్రి ఏడు గంటలకు గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈవో తెలిపారు.



సాదర స్వాగతం

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్(జీఎస్ఐ)కు విచ్చేసిన పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, చిత్రంలో ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రులు వేణుగోపాలకృష్ణ, ఆదిమూలపు సురేష్

-సాక్షి, ఫొటోగ్రాఫర్

నేటి నుంచి విజ్ఞాన్ నిరులోత్సవ్-2కే23



నిరులోత్సవ్ వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తదితరులు

గుంటూరురూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు జాతీయ స్థాయిలో విజ్ఞాన్ నిరులోత్సవ్ 2కె23 నిర్వహిస్తున్నట్టు విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో నిరులోత్సవ్ వాల్‌పోస్టర్‌లను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ శని, ఆదివారాలలో జరగనున్న పోటీలు మొత్తం 39 విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలకు 15వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మొదటి రోజు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జీ.రాజకుమారి, నరసాపురం జిల్లా సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ హాజరవుతారని పేర్కొన్నారు. ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, ఇండియన్ స్క్రీన్ రైటర్ అండ్ ఫిల్మ్ డైరెక్టర్ కే.వీ.విజయేంద్ర ప్రసాద్, ఇండియన్ యాక్టర్ అండ్ కమెడియన్ పీ ప్రియదర్శి హాజరవుతారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులతోపాటు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ఆకర్షణీయ నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయ గీతం.. ఉత్సాహ నాదం

- కన్నీటిని నాట్యంగా మార్చగలిగే దేవుడు ఏసుక్రీస్తు
- రెండో రోజు సభలో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం
- కొనసాగుతున్న గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

గుంటూరు రూరల్: పశ్చాత్తాపంతో విడిచే కన్నీరు దేవునికి చేరుతుందని, అటువంటి హృదయాలను దేవుడు అంగీకరించి, వారి కన్నీటిని నాట్యముగా మారుస్తాడని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం అన్నారు. నగర శివారులోని గోరంట్ల గ్రామంలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం కొనసాగాయి. పిడుగురాళ్లకు చెందిన పాస్టర్ ఇమ్మానుయేలు ప్రార్థన చేసి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో సండే స్కూల్ చిన్నారులు, హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్స్, సిస్టర్స్ బృందం స్తుతి గీతాలను ఆలపించారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ బ్రదర్ అబ్రహాం మాట్లాడుతూ ప్రభువు మన వైపు చూస్తున్నాడని.. ఆయన మన జీవితాన్ని మార్చగలడన్నారు. తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సి.లాజరస్ సందేశాన్నిస్తూ ఎటువంటి పరిస్థితిలోనైనా కలవరపడకూడదని చెప్పారు. ఏసుక్రీస్తు అందరినీ ఆదరించే దేవుడన్నారు.



గీతాలు ఆలపిస్తున్న బ్రదర్ అబ్రహాం, పాస్టర్లు జాన్‌వెస్లీ, ఫ్రెడీపాల్, రమేష్

పరిశుద్ధాత్మ కుమ్మరింపు..

ఉదయం జరిగిన ప్రత్యేక ప్రార్థనలను వినుకొండకు చెందిన పాస్టర్ జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కడపకు చెందిన పాస్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ ఏసు క్రీస్తునందు నమ్మకమైన దాసులుగా ఉండాలన్నారు. కర్నూలుకు చెందిన పాస్టర్ ఫ్రెడి పాల్ సందేశాస్తూ దేవుని పరిశుద్ధాత్మ మనపై కుమ్మరిస్తారని తెలిపారు. ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు క్రీస్తుని సందేశాన్ని విశ్వాసులకు అందజేస్తూ ఏసు క్రీస్తు మరణ శాసనాన్ని రద్దు పరుస్తాడన్నారు. ఆయన మరణాన్ని గెలిచిన దేవుడని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో రెండో రోజు సుమారు 2 లక్షలకు పైగా భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోసం భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పోలీస్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు.

మొండిఘటాలు..

- పంచాయతీ పన్నుల చెల్లింపును బేఖాతరు చేస్తున్న గృహ, వ్యాపార సంస్థల యజమానులు
- జిల్లాలో ఈ ఏడాది లక్ష్యం రూ.25.95 కోట్లు
- ఇప్పటివరకు వసూలు చేసింది రూ.12.92 కోట్లు
- వంద శాతం పన్నుల వసూలుకు ప్రత్యేక సెల్



జిల్లా పంచాయతీ కార్యాలయం

సాక్షి, నరసరావుపేట: దేశ అభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థ పాత్ర చాలా కీలకమైనది. పంచాయతీలు ఆర్థికంగా బలంగా ఉంటేనే వాటి లక్ష్యాల మేరకు పనిచేసి అద్భుతాలు సృష్టించగలవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటులతోపాటు సొంత నిధులు సమకూర్చుకుంటేనే అది సాధ్యం. అప్పుడే ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టే వీలుంటుంది. పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి పన్నుల వసూలు ఎంతో కీలకం. పంచాయతీల పరిధిలో ఉన్న వ్యక్తులు, సంస్థలు ఎప్పటికప్పుడు పన్నులు చెల్లిస్తేనే ఆర్థికంగా నిలదొక్కుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేసే వీలుంటుంది. ప్రభుత్వం, పంచాయతీ సిబ్బంది ఎంత అవగాహన కల్పిస్తున్నా పన్నుల రాబడిలో జిల్లా పంచాయతీలు వెనుకబడే ఉన్నాయి. పల్నాడు జిల్లా పంచాయతీల పరిధిలో ప్రస్తుతం ఇంటి పన్నులు వసూలు కేవలం 50 శాతమే పూర్తయ్యింది అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది వంద శాతం పన్నులు వసూలు చేయడానికి కృషి చేస్తున్నారు.

లక్ష్యం రూ.25.95 కోట్లు...వసూలైంది రూ.12.92 కోట్లు

జిల్లా వ్యాప్తంగా 527 పంచాయతీలు పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి పనుల రూపంలో రూ.25.95 కోట్లు వసూల్ చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి జిల్లా వ్యాప్తంగా కేవలం రూ.12.92 కోట్లు మాత్రమే పంచాయతీ అధికారులు రాబట్టారు. ఈ ఆర్థిక సంవత్సరం గడువు ఈనెల 31తో ముగియనుంది. అప్పటిలోగా జిల్లా వ్యాప్తంగా రూ.13.02 కోట్ల బకాయిలు రాబట్టాల్సి ఉంటుంది. రెంటచింతల, నాదెండ్ల, కారంపూడి, అచ్చంపేట, యడ్లపాడు మండలాలు అత్యల్పంగా పన్నులు వసూలు చేశాయి. పన్నులు రెండు రకాలుగా వసూలు చేస్తారు. ఇంటి, నీటి పన్నులతో పాటు గ్రంథాలయ సెస్సు వసూలు చేయడాన్ని 'పన్నుల' కింద పరిగణిస్తారు. వేలాలు, పెట్రోల్ బంకులు, లే అవుట్లు, సెల్ టవర్లు, బిల్డింగ్ అనుమతులు, వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ నీటి కుళాయిలు 'పన్నేతర ఆదాయం'గా పరిగణిస్తారు. పన్నేతర ఆదాయం వసూళ్లలోనే అంతంతమాత్రంగానే ఉంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.3.58 కోట్లు కాగా ప్రస్తుతానికి రూ.1.56 కోట్లు వసూలైంది. ఇది లక్ష్యంలో 43.74 శాతానికి సమానం.

నోటీసులు బేఖాతరు...

పన్ను బకాయిల వసూళ్లకు సంబంధించి వందశాతం రాబట్టాలని పంచాయతీలకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. మార్చి 31లోగా పన్నులన్నీ వసూలు చేయడానికి అవసమైన అన్ని చర్యలను అధికారులు, సిబ్బంది తీసుకుంటున్నారు. బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అయినా పన్నులు చెల్లించేందుకు బకాయిదారులు ఆసక్తి చూపడం లేదని సిబ్బంది వాపోతున్నారు. మరోవైపు పన్నుల వసూళ్లను సమీక్షించడానికి జిల్లా పంచాయతీ అధికారి మానిటరింగ్ సెల్ ఏర్పాటుచేశారు. నరసరావుపేటలోని జిల్లా పంచాయతీ కార్యాలయం, డివిజన్ కార్యాలయాలలో ప్రత్యేకంగా టీంలను ఏర్పాటుచేసి రోజు వారి వసూళ్లను సమీక్షిస్తున్నారు. వందశాతం పన్నుల వసూళ్ల లక్ష్యంగా పనిచేస్తున్నారు.

20లోగా వందశాతం పూర్తి చేయాలి

ఈనెల 20వ తేదీ నాటికి బకాయి ఉన్న పంచాయతీ పన్నులన్నింటిని వసూలు చేసే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అందులో భాగంగా జిల్లా, డివిజనల్ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్‌లను ఏర్పాటుచేశాం. ఎప్పటికప్పుడు పన్నుల వసూలుపై సమీక్షిస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లో ఈ ఏడాది వందశాతం వసూలు చేయాలి. పన్నుల వసూళ్ల నగదును ప్రతి రోజూ బ్యాంక్, ట్రెజరీలలో జమ చేయాలి.

-భాస్కర్‌రెడ్డి,
డీపీఓ, పల్నాడు జిల్లా

చెట్టును ఢీకొన్న స్కూటీ

ఉపాధ్యాయురాలు మృతి



సంఘటన స్థలంలో ఉపాధ్యాయురాలు మృతదేహం, శ్యామలాదేవి (ఇన్‌సెట్‌లో)

పెదకాకాని: స్కూటీ అదుపుతప్పి చెట్టుని ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం వెనిగండ్ల శివారులో చోటుచేసుకుంది. గుంటూరు నగరానికి చెందిన కాండ్రుకొండ శ్యామలాదేవి(44) ఆరేళ్లుగా మంగళగిరి రూరల్ మండలం నిడమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. గతంలో మంగళగిరి నుంచి ప్రతి రోజూ స్కూల్‌కి వెళ్లేది. రెండు నెలల కిందట గుంటూరు శాంతినగర్‌లో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. దీంతో గుంటూరు నుంచి వెనిగండ్ల గ్రామం మీదుగా నిడమర్రు పాఠశాలకు వెళుతుంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం స్కూటీపై పాఠశాలకు బయలుదేరింది. వెనిగండ్ల శివారు ప్రాంతంలోకి చేరుకునే సరికి ఆమె ప్రయాణిస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో చెట్టు పక్కనే ఉన్న కాలువలో పడింది. తలకు హెల్మెట్ పెట్టుకోవడంతోపాటు ముఖానికి స్కార్ఫ్ కట్టుకున్న ఆమె నీటి కాలువలో బోర్లపడడంతో ఊపిరి ఆడక మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మృతురాలి కుమారుడు జగదీష్ సిద్ధార్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదం జరిగిన సమాచారం అందడంతో నిడమర్రు పాఠశాల నుంచి సంఘటనా స్థలానికి పలువురు ఉపాధ్యాయులు చేరుకున్నారు.

క్లుప్తంగా

నిందితుల అరెస్టు

కారెంపూడి: వైఎస్సార్ సీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీకాంత్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి నట్లు సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. మొత్తం 15 మంది నిందితుల్లో మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పిడుగురాళ్ల: కారు, ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బ్రాహ్మణపల్లి హైస్కూల్ ఎదురుగా శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గురజాలకు చెందిన పులుకూరి నరేంద్ర మండలంలోని కరాలపాడులో బంధువులను ఇంటి వద్ద చుట్టాలను వదిలిపెట్టి తిరిగి గురజాల వెళ్తుండగా బ్రాహ్మణపల్లి వద్ద గురజాల వెళ్లేందుకు మలుపుతిప్పుతుండగా చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్ బస్సు కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో నరేంద్ర(25) అక్కడిక్కడే మృతి చెందగా ట్రావెల్ బస్సులో గాయాలైన వారికి గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదార్థాలు రుచిగా ఉండాలి

మంగళగిరి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా ఉండాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు అక్షయపాత్ర కేంద్రీయ వంటశాలను సందర్శించారు. వంటశాల ఎప్పుడు పరిశుభ్రతగా ఉండాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 26 జిల్లాలు పర్యటించడం జరిగిందని, విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి తెలుసుకుని భోజనంలో లోటు పాట్లను గమనించి సరిచేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అక్షయ పాత్ర సైతం పిల్లలకు మరింత ఇష్టపడి తినే విధంగా భోజనాన్ని అందించాలని కోరారు.

ప్రతిభకు పట్టం.. గురుకులం

- జీసీ విద్యార్థులకు సువర్ణావకాశం
- ఎంజేపీ బీసీ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 4 బాలుర, 3 బాలికల పాఠశాలలు
- రెండు జిల్లాల్లో 360 సీట్లు భర్తీ
- ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ


గురుకులంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు


టెన్త్ టాపర్లను అభినందిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్(ఫైల్)

సత్తెనపల్లి: మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఏడు బీసీ గురుకుల పాఠశాలలున్నాయి. వాటిలో నాలుగు బాలుర, మూడు బాలికల పాఠశాలలు. ఆయా గురుకులాల్లో మొత్తం 360 సీట్లు భర్తీ చేయనున్నారు.

ప్రవేశానికి ప్రతిభా పరీక్ష..

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి గతేడాది లాటరీ పద్ధతిని అనుసరించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. నాలుగవ తరగతి స్థాయిలో తెలుగు-10, ఆంగ్లం-10, గణితం- 15, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల నుంచి 15 మార్కుల చొప్పున మొత్తం 50 మార్కులకు అబ్జెక్టివ్ విధానంలో ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు. ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది.

దరఖాస్తు అర్హతలు..

నాలుగవ తరగతి విద్యార్థులు గురుకుల ప్రవేశానికి అర్హులు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరంతరాయంగా చదివి ఉండాలి. బీసీ, ఈబీసీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31న మధ్య జన్మించి, 9 నుంచి 11ఏళ్లలోపు వయస్సు వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మరో రెండేళ్ల మినహాయింపు కల్పించింది ప్రభుత్వం. తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకూడదు.

రిజర్వేషన్ కోటా ఇలా..

గురుకుల పాఠశాలల్లోని మొత్తం సీట్లలో 74 శాతం బీసీ విద్యార్థులకే ప్రభుత్వం కేటాయించింది. బీసీ-ఏకు 20 శాతం, బీసీ-బీకి 28 శాతం, బీసీ-సీకి 3 శాతం, బీసీ-డీకి 19 శాతం, బీసీ-ఈ విద్యార్థులకు 4 శాతం సీట్లు కేటాయించడం జరిగింది. ఎస్సీ విద్యార్థులకు 15 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6 శాతం, అనాథ విద్యార్థులకు మూడు శాతం సీట్లు, ఈబీసీ, ఇతర కులాల విద్యార్థులకు రెండు శాతం రిజర్వేషన్ కల్పించారు.

దరఖాస్తు ఎలా..?

గురుకులాల్లో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పేరు, పుట్టిన తేదీ, తండ్రి/సంరక్షకుడి మొబైల్ నంబర్ తదితర ప్రాథమిక వివరాలతో పాటు రూ.100 చెల్లిస్తే జర్నల్ నంబరు వస్తుంది.

ఈ నంబర్ ఆధారంగా హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు నమూనాను ప్రింట్ తీసుకోవాలి. గురుకుల పాఠశాలకు నేరుగా అందజేసే దరఖాస్తును పరిగణనలోకి తీసుకోరు. ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గురుకులాలు, సీట్లు ఇలా..

గురుకులం	సీట్లు
సత్తెనపల్లి	40 (బాలికలు)
నరసరావుపేట	40 (బాలికలు)
వినుకొండ	40 (బాలురు)
గురజాల	40 (బాలురు)
నిజాంపట్నం	80 (బాలురు)
వేటపాలెం	80 (బాలురు)
నక్షత్రనగర్	40 (బాలికలు)
మొత్తం	360

ప్రతిభ పరీక్ష ఆధారంగానే ప్రవేశాలు



ఇంగ్లిష్ మీడియంలో ఐదో తరగతి ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరం ప్రతిభా పరీక్ష ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్‌లో గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం.

–ఎం.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల, సత్తెనపల్లి

తిరునాళ్లలో టీడీపీ అత్యుత్సాహం

- అర్ధంతరంగా ఆగిపోయిన విద్యుత్ ప్రభల ప్రదర్శన
- వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన ప్రభను సందర్శించిన ఎమ్మెల్యే పీఆర్కే


వైఎస్సార్ సీపీ ప్రభ వద్ద మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు

దుర్గి: ముటుకూరులో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్లలో టీడీపీ అత్యుత్సాహం ప్రదర్శించింది. భారీ విద్యుత్ ప్రభల వైభవం అర్ధాంతరంగా ఆగిపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు. మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ముటుకూరు వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, జనసేన మద్దతు దారులు 17 భారీ విద్యుత్తు ప్రభలు ఏర్పాటు చేశారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ బాధ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డిపై కండీషన్ బెయిల్, పలు కేసులు ఉన్న నేపథ్యంలో ఆయనకు అనుమతి నిరాకరించారు. విషయం తెలుసుకున్న గ్రామ తెలుగుదేశం నాయకులు తమ నాయకుడికి అనుమతించలేదని నెపంతో టీడీపీ ఏర్పాటు చేసిన ప్రభలకు విద్యుత్ నిలిపివేసి, సాంస్కృతి కార్యక్రమాలను రద్దు చేశారు. నిరసనకు దిగి తిరునాళ్లలో అలజడి సృష్టించారు. టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పలువురికి గాయాలయ్యాయి. టీడీపీ మద్దతుదారులు ఏర్పాటు చేసిన ఏడు ప్రభలు నిలిచిపోవటంతో పోలీసులు జోక్యం చేసుకుని శాంతిభద్రతలు అదుపు తప్పుతాయని ప్రశాంతంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుల ప్రభలను పోలీసులు అర్ధాంతరంగా నిలిపివేశారు. తొలుత వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రభను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(ఆర్కే), వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సందర్శించారు.

చిలకలూరిపేట పురపాలక సంఘం

బహిరంగ వేలం నోటీసు

ఆర్.ఓ.సి.నెం.564/2020/ఎ2 తేది.03-03-2023

చిలకలూరిపేట పురపాలక సంఘం నకు చెందిన డాక్టర్ వై.యస్.ఆర్ మునిసిపల్ కూరగాయల మార్కెట్, చేపలు & మాంసం మార్కెట్ మరియు సంత్రి మార్కెట్ నందు 2023-2024 ఆర్థిక సంవత్సరమునకు గాను అనగా తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు గుంటూరు జిల్లా అసాధారణ రాజపత్రం 08 తేది 27-02-2023 మేరకు గుత్తలను వసూలు చేసుకొను హక్కులను లీజుకు ఇచ్చుటకు గాను ది.10-03-2023 అనగా శుక్రవారం ఉదయం 11.00 గంటలకు చిలకలూరిపేట పురపాలకసంఘ కౌన్సిల్ హాలు నందు మునిసిపల్ కమీషనర్ వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

గమనిక: ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు తెలుసుకోవచ్చును.

సం/- కమీషనర్, చిలకలూరిపేట పురపాలక సంఘం

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.219/2019/ఎ4 తేది.03-03-2023

నరసరావుపేట పురపాలక సంఘమునకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు ఈ దిగువ తెలిపిన మార్కెట్ వగైరాల యందు ఆశీలు వసూలు చేసుకొను హక్కును గజిట్ షరతులకు లోబడి నిర్వహించుకొనుటకు గాను ది.23-03-2023 గురువారం ఉదయం గం॥ 11.00 పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలము శ్రీయుత కమీషనర్ గారిచే గాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని నిర్వహించబడును. ఏ కారణము చూపకయే వేలంను వాయిదా వేయుటకు కమీషనర్ గారికి పూర్తి అధికారం కలదు.

వ. నెం.	వివరములు లీజు కాలం 1-4-2023 నుండి 31-3-2024 వరకు	కమీషనరు/తహశీల్దారు వార్లచే జారీ చేయబడిన ఆస్తి విలువ ధృవపత్రము	వేలంపాటదారులలో ముందుగా చెల్లించవలసిన ధరావత్తు
1	దినసరి కూరగాయల మార్కెట్ (హోల్‌సేల్ & రిటైల్)	రూ. 8,00,000.00	రూ. 1,00,000.00
2	సంత్రి మార్కెట్	రూ. 8,00,000.00	రూ. 50,000.00
3	చేపలు & మాంసం మార్కెట్	రూ. 2,00,000.00	రూ. 25,000.00
4	కబేళా – 1	రూ. 50,000.00	రూ. 10,000.00
5	కబేళా – 2	రూ. 25,000.00	రూ. 5,000.00

పాటలో పాల్గొనదలచిన వారి సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్ లేనిచో సాల్వెన్సీ బదులుగా చూపబడిన నగదు దాఖలు చేసి వేలంలో పాల్గొనవలెను. (సదరు ఆస్తిపై ఏ విధమైన తనఖాలు లేవని సబ్ రిజిష్టరు వారిచే జారీ చేయబడిన ఇ.సి) సదరు ఆస్తికి సంబంధించి ఏ విధమైన వివాదాలు లేవని వ్యక్తిగత ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలుతో పాటు ముందుగా ధరావత్తు నగదు రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

గమనిక: ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు సంబంధిత సెక్షన్ వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనర్, నరసరావుపేట మునిసిపాలిటి.

సాగర్ నీటిమట్టం 546 అడుగులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 546.00 అడుగుల వద్ద ఉంది. 201.0530 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200 క్యూసెకులు, ఎడమ కాలువకు 9,076, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 21,796 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి 21,796 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

ప్రాణాలకు తెగించి మంటలు అదుపు

- నల్లమల అడవిలో కార్చిచ్చు
- అదుపునకు కృషి చేసిన పర్యావరణ ప్రేమికుడు


అడవిలో రేగిన మంటలను అదుపు చేస్తున్న జాజి

కారెంపూడి: పర్యావరణ ప్రేమికుడు అతని స్నేహితుని సాయంతో అడవిలో చెలరేగిన మంటలను ఆర్పివేసి అడవి దగ్ధం కాకుండా కాపాడిన ఘటన పల్నాడు జిల్లా కారెంపూడి శివారులోని నల్లమల అడవిలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని సింగరుట్ల అగ్రహారం ఎత్తయిన కొండపై మంటను చూసిన కారెంపూడికి చెందిన కొమెర అంకారావు (జాజి), అతడి స్నేహితుడు విజయ్‌తో కలసి కొండ ఎక్కి మంటలను ఆర్పేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శ్రమించారు. అక్కడ నీటి లభ్యత లేకున్నా కేవలం పచ్చి చెట్ల మండలతో మంటను ఆర్పివేశారు. వేసవి ఎండలు కాస్తుండడంతో నల్లమల అడవిలో గడ్డి చెట్లు చాలా వరకు ఎండిపోయాయి. అడవిలో ఎత్తయిన కొండలపై వీస్తున్న గాలికి వ్యాపిస్తున్న మంటలను ఆర్పేందుకు వారు శ్రమించారు. ఎంతో కాలంగా నిత్యం నల్లమల అడవిలో గడుపుతూ అక్కడ మొక్కలు నాటి వాటిని కాపాడుతూ అడవిలో మందుబాబులు తాగిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్‌ను సీసాను ఇతర వ్యర్థాలను ఏరి అడవి బయటకు తరలించే పనిని జాజి చాలా కాలంగా చేస్తున్నారు. ఈ క్రమంలో కొండపై మంటలను చూసి ఆయన స్పందించి అడవి దగ్ధం కాకుండా కాపాడారు.

చచ్చి బతికాం.. కొమెర జాజి

కిలో మీటరు దూరం కొండను ఎక్కాం. కూడు నీళ్లు లేవు. తీసుకెళ్లిన వాటర్ బాటిల్‌లో కొంచెం కూడా మంట తగలడం వలన లేకుండా పోయాయి. నిర్విరామంగా ఆరితేనే మంటలు ఆరిపోయాయి. సాయంత్రం కొండె దిగేటప్పుడు పిక్కలు పట్టుకుపోయాయి. నోరు పిడసకట్టుకుపోయింది. అలాగే దోగాడుకుంటూ కొండ దిగాం. ఎక్కడ ప్రాణం పోతుందోననే భయంతో సింగరుట్ల నరసింహస్వామి ఆలయం కొండ దొన కింద నీటితో గొంతు తడుపుకుని బతికాం.

ఆగమ సలహా మండలి చైర్మన్‌గా సత్యశ్రీనివాస అయ్యంగార్


అయ్యంగార్‌ను సత్కరిస్తున్న కమిషనర్ హరిజవహర్‌లాల్

నరసరావుపేట ఈస్ట్: దేవదాయశాఖ ఆగమ సలహా మండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన వైఖానస ఆగమ పండితుడు డాక్టర్ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గొల్లపూడిలోని దేవదాయశాఖ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. 12 ఆగమాలకు సంబంధించి 12మంది సభ్యులతో కూడిన సలహామండలికి అయ్యంగార్ తొలి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దేవాలయ వ్యవస్థ, అర్చక వ్యవస్థలో శాస్త్రీయబద్ధమైన మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అయ్యంగార్‌ను పట్టణానికి చెందిన వైఖానస ప్రతినిధులు రొంపిచర్ల ఆంజనేయులు, వి.వి.కె.ఎస్.అయ్యంగార్, పి.వి.రంగాచార్యులు, పి.రామకృష్ణమాచార్యులు అభినందించారు.

మానవ మనుగడకు భూగర్భ శాస్త్రం పునాది

వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: మానవ మనుగడకు భూగర్భ శాస్త్రం పునాది అని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జియోసైన్సెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ (ఆర్‌టీజీఏఎస్-2023) అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ వనరులు, శక్తి స్థిరత్వం పైనే మానవ స్థిరత్వం ఆధారపడి ఉంటుందన్నారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ(నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) విశ్రాంత ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి.బలరామ్ కీలకోపన్యాసం చేస్తూ ఎన్‌జీఆర్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అధ్యయనాల్లో ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో విలువైన భూగర్భ ఖనిజాలను నిర్ధారించడం జరిగిందన్నారు. సదస్సు డైరెక్టర్, జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఏశాక్(ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్) డైరెక్టర్ ఎ.నాగేశ్వరరావు, వారణాసి బెనారస్ హిందూ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ఎన్‌వీ చలపతి రావు, ఉత్తరాఖండ్ కుమాయున్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య సంతోష్ కుమార్, ఉత్తర ప్రదేశ్ బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య ఎంఎం సింగ్ మాట్లాడారు. ఏఎన్‌యూ సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, యూనివర్సిటీ పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఎల్.ఉదయకుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ బి.హరిబాబు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) | Syndicate

గుంటూరు మెయిన్ బ్రాంచ్
హిందూ హైస్కూల్ క్యాంపస్ మెయిన్ రోడ్, గుంటూరు-522003, ☎ 0863-2221751

అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. [illegible] కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్ [illegible] 12.04.2023న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏముందో అది" అనే ప్రాతిపదికన [illegible]

ఇ-వేలం తేది: 12.04.2023 | ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 10.04.2023, సా॥ 4.30 గం.లలోపు

1 ఋణగ్రహీత(లు): మెస్సర్స్ కె ఎస్ ఎల్ ట్రేడర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ కంభంపాటి రవిచంద్ర, తండ్రి: కె నాగేశ్వరరావు మరియు హామీదారు: శ్రీ కంభంపాటి నాగేశ్వరరావు, తండ్రి: వెంకట సుబ్బయ్య, తేది. 02.03.2023 నాటికి బకాయి మొత్తం: రూ. 1150.09 లక్షలు + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

ఆస్తి నెం.1: గుంటూరు జిల్లా, [illegible] 1255.55 చ॥గ॥ల ఇండస్ట్రియల్ భూమి & [illegible] 1255.55 చ॥గ॥ల ఇండస్ట్రియల్ భూమి.

రిజర్వు ధర: రూ. 300.00 లక్షలు | **ధరావత్తు సొమ్ము: రూ. 30.00 లక్షలు**

ఆస్తి నెం.2: గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, కొరిటిపాడు సబ్-జిల్లా, గోరంట్ల గ్రామం. డి నెం: 92/1, సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 2789/2015, తేది: 25.04.2015 ప్రకారం 93.75 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో 11.86 చ॥గ॥లు రోడ్డు వైడెనింగ్‌లో పోగా మిగతా విస్తీర్ణం 81.89 చ॥గ॥ల రెసిడెన్షియల్ భూమి మరియు సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1344/2015 తేది: 20/02/2015 ప్రకారం 197.25 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో 87.22 చ॥గ॥ల రెసిడెన్షియల్ భూమి [illegible] 81.89 చ॥గ॥ల స్థలం. డాక్యుమెంట్ నెం.1344/2015 ఆస్తికి హద్దులు: [illegible] 87.22 చ॥గ॥ల స్థలం.

రిజర్వు ధర: రూ. 30.83 లక్షలు | **ధరావత్తు సొమ్ము: రూ. 3.10 లక్షలు**

2 ఋణగ్రహీత(లు): మెస్సర్స్ లిఖిత్ సాయి కృష్ణ ఏజెన్సీస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ మండల సంజీవ రెడ్డి, తండ్రి: మోహన రెడ్డి మరియు హామీదారు: శ్రీమతి మండలం సునీత, భర్త: మండల సంజీవ రెడ్డి. తేది. 02.03.2023 నాటికి బకాయి మొత్తం: రూ. 307.06 లక్షలు + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

ఆస్తి నెం.1: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్-డిస్ట్రిక్ట్, [illegible] డాక్యుమెంట్ నెం. 1664/2011 తేది 05.03.2011 ప్రకారం 434 చ॥గ॥లు మరియు డాక్యుమెంట్ నెం.1690/2011 తేది 07.03.2011 ప్రకారం 441.25 చ॥గ॥లు కలిపి మొత్తం 875.25 చ॥గ॥ల (ఐటెం 1: 434 చ॥గ॥ - ఐటెం 2: 441.25 చ॥గ॥) [illegible] డాక్యుమెంట్ నెం. 1664/2011 (ఐటెం నెం.1)కు హద్దులు: [illegible] డాక్యుమెంట్ నెం. 1690/2011 (ఐటెం నెం.2)కు హద్దులు: [illegible] 441.25 చ॥గ॥ల [illegible]

రిజర్వు ధర: రూ. 51.30 లక్షలు | **ధరావత్తు సొమ్ము: రూ. 5.15 లక్షలు**

ఆస్తి నెం.2: [illegible] నెం.1238/2011 తేది 27.10.2011 ప్రకారం శ్రీమతి మండల సునీత, భర్త: మండల సంజీవ రెడ్డి పేరున గల 2045 చ॥గ॥ల విస్తీర్ణం భూమి. [illegible] ఈ హద్దులతో 2045 చ॥గ॥ల ఇండస్ట్రియల్ భూమి.

రిజర్వు ధర: రూ. 78.30 లక్షలు | **ధరావత్తు సొమ్ము: రూ. 7.85 లక్షలు**

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్, చీఫ్ మేనేజర్ గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు: ఫోన్: 8331015700.
ఇ-వేలం విధానం మరియు నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వెబ్‌పోర్టల్: https://www.bankeauctions.com వ్యక్తి పేరు: శ్రీ పి. ధరణీకృష్ణ, మొబైల్: 9948182222.

తేది:03.03.2023, ప్రదేశం: గుంటూరు | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్